క్లుప్తంగా

రోడ్లు ఇలా.. నడిచేదెలా?



బురదలో నడుచుకుంటూ సచివాలయానికి వెళ్తున్న కందులాపురం వాసులు

కంభం: బురదమయంగా మారిన అంతర్గత రోడ్లపై రాకపోకలు ఎలా సాగించాలని కందులాపురం పంచాయతీలోని పలు వీధుల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్లు పూర్తిగా బురదమయంగా మారిపోయాయి. శుక్రవారం పలువురు మహిళలు, ప్రజలు బురదలోనే నడుచుకుంటూ కందులాపురం సచివాలయం వరకు వెళ్లి కార్యదర్శి జ్యోష్ణ్యులుకు వినతిపత్రం అందజేశారు. సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కంభం: పిల్లల భాషణ వైకల్యాలపై అప్రమత్తంగా ఉండాలని, వారిని అర్థం చేసుకుని అండగా నిలవాలని మండల విద్యాశాఖాధికారి మాల్యాద్రి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిస్ లెక్సియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు నూర్జహాన్ మాట్లాడుతూ.. సాధారణ పిల్లల్లో సైతం డిస్ లెక్సియా, డిస్ క్యాలిక్లియా, డిస్ గ్రాఫియా లాంటి వైకల్యాలతో నిర్దిష్ట అభ్యసన సామర్థ్యాలు లేకపోవడాన్ని పాఠశాల స్థాయిలోనే గుర్తించవచ్చని, అటువంటి వారికి ప్రత్యేక బోధన చేయడం ద్వారా వారిలో పురోభివృద్ధి సాధించవచ్చన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన



నాగంపల్లిలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంట పొలాలను ఏఓ ప్రసన్న రంగలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. నాగంపల్లి, గొట్లగట్టు, పేరారెడ్డిపల్లి, వెంగళపల్లి, కాట్రగుంట గ్రామాల్లో సాగు చేసిన మినుము, అలసంద, మిర్చి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఐదు రోజుల పాటు విస్తారంగా కురిసిన వర్షాలకు పలు రకాల పంట పొలాలు నీట మునిగాయని ఏఓ అన్నారు. ఎక్కువగా అలసంద, మినుము పంటలతోపాటు లేత పొగాకు చేలు నీట మునిగాయని రైతులు ఏఓ దృష్టికి తెచ్చారు. జరిగిన నష్టం గురించి జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఏఓ చెప్పారు.

అభ్యసన వైఫల్యాలపై అవగాహన



కొనకనమిట్లలో అవగాహన ర్యాలీలో ఎంఈఓ, ఉపాధ్యాయులు

కొనకనమిట్ల: మండలంలోని ఇరసలగుండం ఏపీ పాఠశాలను శుక్రవారం ఎంఈఓ–2 నరసింహరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యంగా తయారు చేయాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం కొనకనమిట్లలో శుక్రవారం అభ్యసన వైఫల్యాలు, రాయడం, చదవడంలో తప్పులు పలకడంపై విద్యార్థులకు ఐఈఆర్‌టీఎస్‌లు పద్మజ, విజయలక్ష్మి పర్యవేక్షణలో అవగాహన కల్పించారు. జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుజాత, సీఆర్‌పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు భూమి పూజ



కొమరోలు : భూమి పూజ చేస్తున్న ఎంపీడీఓ

కొమరోలు: మండలంలోని వట్టివేపమానుపల్లి, అల్లినగరం, యర్రగుంట్ల, రెడ్డిచెర్లలో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి, రెడ్డిచెర్ల సర్పంచ్ ఉమాదేవి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ ఆర్.మహాలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ వీరయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ బ్రహ్మయ్య పాల్గొన్నారు.



కొనకనమిట్ల : పేరారెడ్డిపల్లి వద్ద రహదారిపై ప్రవహిస్తున్న నీరు



బొడిచర్ల గ్రామం వద్ద రోడ్డుపైకి ప్రవహిస్తున్న నీరు



మార్కాపురం - తర్లుపాడు రహదారిపై పారుతున్న నీరు

పశ్చిమాన కుండపోత

- మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు
- జలమయమైన వీధులు, లోతట్టు ప్రాంతాలు
- చిత్తడిగా మారిన అంతర్గత రహదారులు
- పొలాలు నీట మునగడంతో రైతుల ఆందోళన
- పంటలకు భారీ నష్టం తప్పదని అంచనా



కొనకనమిట్ల : కాట్రగుంటలో మినుము చేలో నిలిచిన నీరు



కొనకనమిట్ల : కొనకనమిట్లలో లేత మినుములో వర్షం నీరు

మార్కాపురం/మార్కాపురం రూరల్/తర్లుపాడు/కొనకనమిట్ల/కంభం/బేస్తవారిపేట: బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వాగులూ వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు మార్కాపురంలో 4 మి.మీ, తర్లుపాడులో 3 మి.మీ, పొదిలిలో 1.2 మి.మీ, బేస్తవారిపేటలో 16 మి.మీ, కంభంలో 5.2 మి.మీ, పుల్లలచెరువులో 3.4 మి.మీ, యర్రగొండపాలెంలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా అల్పపీడనం, వాయుగుండం ప్రభావంతో గత ఐదు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

పొంగి పొర్లుతున్న వాగులు

☛ మార్కాపురం మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. బొడిచర్ల వద్ద గుండ్లకమ్మ నీరు రోడ్డుపైకి ప్రవహించింది. కొట్టాలపల్లి వద్ద ఉప్పువాగు పొంగడంతో కొంత సమయం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గిద్దలూరు, కంభం ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు గుండ్లకమ్మలోకి భారీగా వరద నీరు చేరుతోంది.

☛ తర్లుపాడు మండలంలో శుక్రవారం వర్షం దంచికొట్టింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన వాన సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసింది. దీంతో రహదారులు, పంట పొలాలు జలమయమయ్యాయి. వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. తర్లుపాడు–మార్కాపురం ప్రధాన రహదారిపై వర్షం నీరు పారుతుండటంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. తుమ్మలచెరువు కొత్త చెరువు నిండటంతో గ్రామంలో నుంచి నీరు పారి మార్కాపురం చెరువుకు చేరాయి. తర్లుపాడు చెరువుకు భారీగా వర్షం నీరు చేరింది. పత్తి, మిరప, కంది చేలల్లో నీరు నిలిచింది.

☛ కొనకనమిట్ల మండలంలో శుక్రవారం మళ్లీ భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. కాట్రగుంట పంచాయతీ పేరారెడ్డిపల్లి వద్ద వర్షం నీరు రహదారులపై ప్రవహించింది. వెంగలపల్లి గ్రామంలోకి వరద నీరు చేరింది. బీసీ కాలనీకి వెళ్లే రహదారిలో మోకాలి లోతున నీరు పారింది. కొనకనమిట్ల ఎస్సీ కాలనీలు, నాగంపల్లి హరిజన కాలనీలో వర్షం నీరు చేరి అంతర్గత రహదారులు చిత్తడిగా మారాయి.

☛ శుక్రవారం మధ్యాహ్నం కంభంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి చిరుజల్లులు పడుతూ మధ్యాహ్నం రెండు గంటల సమయంలో భారీ వర్షం కురవడంతో వీధులన్నీ జలమయమయ్యాయి. మిర్చి, పత్తి పొలాలు నీటమునిగాయి. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, పాఠశాలల వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. బేస్తవారిపేట మండలంలోని పలు గ్రామాల్లోనూ వర్షం కురిసింది.

రైతు కష్టం నీటి పాలు

మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి, మిర్చి, కంది పొలాల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో మొక్కలు నేలవాలడంతోపాటు ఉరకెత్తుతున్నాయి. లేత పొగతోటలు, మినుము, అలసంద, మిర్చి చేలు కోతలకు గురవడంతోపాటు నీట మునిగాయి. రబీ పంటలు సాగు చేసి నెల కూడా కాకముందే భారీ వర్షాలు పడుతుండటంతో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. పత్తిలో కాయకుళ్లు, మిరపలో ముడత తెగులు, కంది పైరును ఎండు తెగులు ఆశించే ప్రమాదం ఉండటమే రైతుల ఆందోళనకు కారణం. మార్కాపురం మండలంలోని దరిమడుగు, వేములకోట, చింతగుంట్ల, నికరంపల్లి, జమ్మనపల్లి, కోలభీమునిపాడు, బోడపాడు, రాయవరం, మొద్దులపల్లి, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, చెన్నారెడ్డిపల్లి, కలుజువ్వలపాడు, కొనకనమిట్ల మండలం నాగంపల్లి, పేరారెడ్డిపల్లి, బచ్చలకూరపాడు, కొనకనమిట్ల, కంభం, రాచర్ల, కొమరోలు మండలాల్లోని పలు గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. సబ్ డివిజన్‌లోని మార్కాపురం, పెద్దారవీడు, తర్లుపాడు, కంభం, అర్ధవీడు మండలాల్లో పత్తి 4,120.03 హెక్టార్లలో, మిర్చి 3731.78, పొగాకు 1465.26 సాగైంది. ఇంకా కంది ఆముదం తదితర పంటలు సాగయ్యాయి. ఎకరాకు సుమారు 15 నుంచి 20 వేల వరకూ పత్తి సాగుకోసం రైతులు పెట్టుబడి పెట్టారు. మిర్చి సాగు కోసం ఎకరాకు రూ.20 వేలకు పైగా ఖర్చు చేశారు. ఈ తరుణంలో భారీగా కురిసిన వర్షంతో దిగుబడిపైనా ప్రభావం చూపుతుందని, నష్టం తప్పేలా లేదని మదనపడుతున్నారు.

పత్తిలో జాగ్రత్తలు అవసరం



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పత్తి పంటలో అధిక తేమ ఉండటం వల్ల మొక్కలకు భూమి నుంచి పోషకాలను గ్రహించే శక్తి ఉండదు. దీని వల్ల మొక్కలు ఎర్రబడి వాడిపోతున్నాయి. నివారణకు పది గ్రాములు 19:19:19, పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 10 గ్రాములు లీటర్‌నీటికి కలిపి 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. దీని వల్ల మొక్కలు త్వరగా కోలుకుంటాయి. పత్తిలో అక్కడక్కడా పూత, కాయ రాలిపోతోంది. నివారణకు ప్లానోఫిక్స్ 2 మి.లీ మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏఓ, మార్కాపురం



నాగులవరం రోడ్డులో నీట మునిగిన కాలనీ



కంభంలో నీట మునిగిన మిరప తోట



కంభం తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిన వర్షం నీరు



వేములకోట వద్ద నీట మునిగిన పత్తి చేను



దరిమడుగులో రాలిపోయిన పత్తి కాయలు చూపుతున్న రైతు వెంకటేశ్వరరెడ్డి



కొనకనమిట్ల : నాగంపల్లిలో నీట మునిగిన పంట పొలాలు

విద్యుత్ సర్‌చార్జీల భారం మోపొద్దు



మార్కాపురంలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మార్కాపురం: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను, ట్రూఅప్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మా బాలనాగయ్య డిమాండ్ చేశారు. సుమారు 11 వేల కోట్ల రూపాయల భారాన్ని సర్దుబాటు పేరుతో ప్రభుత్వం ప్రజలపై మోపడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఇంతలోనే భారీ ఎత్తున విద్యుత్ చార్జీల భారం మోపడం ప్రజలను నిలువునా మోసం చేయడమేనన్నారు. గత ప్రభుత్వం పెంచిన చార్జీలను తాము అధికారంలోకి రాగానే తగ్గిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను గతంలో వ్యతిరేకించిన టీడీపీ నాయకులు పెట్టాలనే ఆలోచనను విరమించుకోవాలని, సర్దుబాటు చార్జీలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాజు, నన్నేసా, లక్ష్మయ్య, నాగరాజు, విక్టర్, లోకేష్, మల్లికార్జునరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి

కంభం: అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో అదనపు భారం మోపడం ప్రజలను మోసగించడమేనని సీపీఎం నాయకులు తిరుపతిరావు, అన్వర్ విమర్శించారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆకస్మిక వరదలు, కరువుతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం కల్పించకపోగా అదనపు చార్జీలు వసూలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును గతంలో తప్పుబట్టి ఇప్పుడు ఎలా బిగిస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు దానం తదితరులు పాల్గొన్నారు.



కంభంలో ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



గిద్దలూరులో విద్యుత్ శాఖాధికారికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి

గిద్దలూరు రూరల్: విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారి శేషగిరిరావుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు థామస్, పూర్ణ, డి.మూర్తి, భాష, శ్రీనివాసులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల వినూత్న నిరసన

- నోటికి నల్ల రిబ్బన్లు ధరించి మౌన దీక్ష
- మద్దతుగా నిలిచిన ప్రజా సంఘాలు



నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘంలో అక్రమ తొలగింపునకు గురైన కాంట్రాక్టు కార్మికులు నోటికి నల్ల రిబ్బన్లు ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారంతో నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు డి.సోమయ్య మాట్లాడుతూ.. మున్సిపల్ కార్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో సుమారు 20 ఏళ్లకుపైగా పనిచేస్తున్న ఉద్యోగులను ఎటువంటి నోటీసు లేకుండా అక్రమంగా తొలగించడాన్ని తప్పుబట్టారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులపై రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఉద్యోగుల పొట్ట కొట్టడాన్ని ఆక్షేపించారు. అధికారులు చట్టబద్ధంగా పనిచేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు కె.సుబ్బరాయుడు, రమణ, సలాంఖాన్, కె.నాగేంద్ర, షబ్బీర్, శేషిరెడ్డి, యూసఫ్, అల్లూరయ్య, సుబ్బారెడ్డి, శ్రీను, చెన్నకేశవులు, సాధిక్‌వలి పాల్గొన్నారు.

22న కంభంలో జాబ్ మేళా

కంభం: ఈనెల 22న ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. జాబ్ మేళాలో పోర్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, మాస్టర్ మైండ్స్, డైకిన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. వివరాలకు స్కిల్ సెంటర్ కో ఆర్డినేటర్ 7997151082, 8019311043ను సంప్రదించాలని ఓ ప్రకటనలో సూచించారు.

మందుబాబుల జేబుకు చిల్లు!

- మద్యం వ్యాపారుల సిండికేట్ ఇష్టారాజ్యం
- ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు
- క్వార్టర్ బాటిల్‌పై రూ.30 అదనంగా వసూలు
- ప్రశ్నించిన వారిపై దౌర్జన్యం, దబాయింపు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అధికారులు

మార్కాపురం: కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరకు ఇస్తామని చెప్పి ఓట్లేయించుకున్న నేతలు ‘సంపద సృష్టి’ యావలో కూరుకుపోయారు. వారిని నమ్మి ఓట్లేసిన మందుబాబులు మాత్రం తమ జేబుకు చిల్లు పడుతుండేసరికి లబోదిబోమంటున్నారు. మార్కాపురం నియోజకవర్గంలో మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయిస్తుండటంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. గురువారం నుంచి పట్టణంలో నూతన లిక్కర్ షాపులు ప్రారంభమయ్యాయి. తొలిరోజు నుంచే వ్యాపారులందరూ కూటమిగా ఏర్పడి అధిక ధరలకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. మార్కాపురం పట్టణంలో 4, రూరల్‌లో 3, తర్లుపాడులో 2, కొనకనమిట్ల 3, పొదిలిటౌన్ 5, పొదిలి రూరల్ 2.. వెరసి మొత్తం 19 షాపులు ఉండగా అత్యధికంగా టీడీపీ, జనసేన నాయకులకే 17 షాపుల లైసెన్స్‌లు దక్కాయి. దీంతో వీరందరూ సిండికేట్‌గా మారి ప్రతి క్వార్టర్ బాటిల్‌పై 30 రూపాయలు అదనంగా వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో 99 రూపాయలకే లిక్కర్ ఇస్తామన్న కూటమి ప్రభుత్వ హామీ కూడా సురాపానంలో కలిసిపోయింది. ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయించేలా చూడాల్సిన ఎక్సైజ్ అధికారులు అధిక ధరల సంగతి తమకేమీ తెలీనట్టుగా నిద్ర నటిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం వ్యాపారుల తీరుపై మందుబాబులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలిరోజే రూ.30 వసూలు చేశారంటే రాబోయే రోజుల్లో రూ.50 అదనంగా తీసుకోవడం ఖాయమని మందుబాబులు కాస్త గట్టిగానే నోటికి పనిచెబుతున్నారు. మార్కాపురం లిక్కర్ వ్యాపారులు సిండికేట్‌గా మారి అదనంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యవహారం సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం తమ దృష్టికి రాలేదని చెప్పడం గమనార్హం. కట్టడి చేయాల్సిన అధికారులే అవునా... అంత మొత్తం వసూలుచేస్తున్నారా? అని మాట్లాడటం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి ఎమ్మార్పీ ధరలు అమలయ్యేలా చర్యలు చేపడతారో లేదో వేచి చూడాల్సిందే.

క్వార్టర్‌పై రూ.30 ఎక్కువ తీసుకున్నారు



99 రూపాయలకే క్వార్టర్ బాటిల్ వస్తుందని టీవీల్లో చెబుతుంటే నిజమని నమ్మి మార్కాపురంలోని కంభం రోడ్డులో సారాయి కొట్టుకు వెళ్లా. అక్కడేమో ఒక్కో క్వార్టర్ సీసా మీద రూ.30 అదనంగా తీసుకున్నారు. అదేందని అడిగితే ‘ఇక్కడింతే.. కావాలంటే తీసుకో.. లేదంటే బాటిల్ అక్కడపెట్టి వెళ్లిపో’ అన్నారు. – సుబ్బయ్య, మార్కాపురం

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్ అందిస్తున్న పిచ్చయ్యయాదవ్

గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు పాఠశాల ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్య యాదవ్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను అందించడంపై పిచ్చయ్యయాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు శ్రద్ధతో విద్యను అభ్యసించి ఉజ్వల భవిష్యత్తు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.